# సూర్యం సాహసం

"సూర్యనారాయణా!"

"బయటికి వెళ్ళారు. ఇప్పుడే వస్తారు. ఇట్లా హాలులోకి వచ్చి కూర్చోండి."

సోమయాజులు చెప్పులు వరండాలో విడిచి హాలులోకి వచ్చి చినిగి పోయిన చిరిచాపమీద కూర్చున్నాడు. సరిగా పదిహేనుమంది కూర్చునే చోటులేని ఆ హాలులో ఆ చిరిచాప మాత్రమే ఉన్నది.

వినేవాడుంటే మానవుడి పరిసరాలు మానవుణ్ణి గురించి సందేశం ఇస్తాయి. సూర్యనారాయణ ఇల్లు అతని దారిద్ర్యాన్ని చాటుతున్నది. ఆ ఇంటికి సూర్యనారాయణ అయిదు రూపాయల అద్దె యిస్తూ, అందులో తన భార్యతోనూ ముగ్గురు పిల్లలతోనూ నివసిస్తున్నాడు. అతను చదరంగం బాగా ఆడుతాడు కనకనూ, వెనక కొన్ని మంచి పద్యాలు రాశాడు కనకనూ అతనికి కొందరు మిత్రులున్నారు. అందులో సోమయాజులు ఒకడు.

సూర్యనారాయణతో "ఒక ఎత్తు" వేస్తేనేగాని సోమయాజులుకు రోజు గడువదు. అయితే సూర్యనారాయణకు చదరంగం అన్నం పెట్టటం లేదనీ, ఉదర నిమిత్తం అతను బాంకులో గుమాస్తాగా ఉంటున్నాడనీ సోమయాజులుకు తెలుసు. వాళ్ళిద్దరికీ మధ్య స్నేహం ఉంది కనక సూర్యనారాయణ లోనవుతున్న ఆర్థిక చిక్కులూ, అతనికున్న గృహచ్ఛిద్రాలూ సోమయాజులుకు తెలుసు.

"ఇవాళ సాయంత్రం మా ఇంట్లో పార్టీ ఇస్తున్నాను. అయిదు గంటలకు నువ్వు తప్పక రావాలోయ్" అని సూర్యనారాయణ ఇవాళ ఉదయం సోమయాజులుతో చెప్పాడు. రాకపోతే చాలా నొచ్చుకుంటానన్నాడు. తన స్నేహితులంతా వస్తున్నారని కూడా చెప్పాడు.

అయిదయింది. సూర్యనారాయణ ఇంట్లో లేడు సరేకదా ఇంకెవరూ కూడా రాలేదు. చిత్రనళీయం నాటకంలో దమయంతి ద్వితీయ స్వయంవరానికని వచ్చిన ఋతుపర్ణుడి పని అయింది సోమయాజులుకు, తేడా ఏమిటంటే సూర్యనారాయణ ఈ పార్టీ ఎందుకిస్తున్నాడో సోమయాజులుకు తెలియదు. సోమయాజులుకు కలగరాని అపోహకూడా క్షణికంగా కలిగింది. ఏమో, మన స్తత్వాలను నమ్మటానికి వీల్లేదు. సూర్యనారాయణ పెళ్ళాం, ముగ్గురు పిల్లల తల్లి అయినా, పాతికేళ్ళలోపు మనిషి. సన్నదనంలోనే నాజూకూ, కొంత ఆకర్షణా.

"సూర్యం ?" అని పొలికేక వినపడింది.

సూర్యనారాయణ మరొక స్నేహితుడు బూట్లు టక టక లాడించుకుంటూ వచ్చాడు.

"రండి రంగారావుగారూ! ఒంటరిగా కూచున్నాను" అన్నాడు సోమయాజులు.

"వాడేడీ ?" అన్నాడు రంగారావు.

"ఎక్కడికో వెళ్ళినట్టుంది."

"మీరు శ్రీ, నేను చుక్కా! అవునా! వీడు, పొయ్యదలుచుకున్నటీ ఏదో త్వరగా పోస్తే బాగుండునే! నాకూ సారథికీ క్లబ్బులో ఫ్రెండ్లీ మాచ్ ఉంది కూడానూ" అన్నాడు చంకలోవున్న రాకెట్టు తీసి గోడకానిస్తూ.

"కూర్చోండి" అన్నాడు సోమయాజులు. చింకి చాపమీద తనపక్క రంగారావుకు చోటు చూపిస్తూ. కాని, పాపం, రంగారావు సూటులో క్రింద ఎట్లా చలికిల పడతాడు.

"ఒక్క కుర్చీ కొనరా అంటే కొనడు. నేనన్నా కొనివ్వాలి. జ్ఞాపకం ఉండదు. ఎప్పటికప్పుడు మరుస్తూ ఉంటాను. కుర్చీ లేంది సూర్యం ఇంటికి రావటం ఇంపాసిబిల్" అన్నాడు రంగారావు.

ఒక్కొక్కరే రాసాగారు. శ్రీపతీ, హనుమంతరావూ వచ్చారు. వాళ్ళిద్దరూ బాంకులో గుమాస్తాలు. వాళ్ళ వెనకనే బాంకు మేనేజరు రామనాథంగారు కూడా వచ్చారు.

అయిదున్నర కావస్తున్నది. తొమ్మిదిమంది అతిథులు వచ్చారు. వాళ్ళు కూర్చోవటానికి చాపలు లేవు, కుర్చీలు లేవు.

రంగారావూ, మరి ఒకరిద్దరూ వెళ్ళిపోవటానికి సిద్ధమవుతుండగా సూర్యనారాయణ వచ్చాడు

బయటినుంచి ఎవరో తివాసీలు తెచ్చి పరిచారు.

"అందరూ కూచోండి. స్నేహితుల్ని పిలిచి వాళ్ళందరికీ ఇంత టీ పోసే మహా భాగ్యం నా బోటివాడికి ఎట్లా కలగను? ఇవాళకు కలిగింది. ఇంతమంది ధనికులు, నాతో పోలిస్తే, శ్రీమంతులు. ఈ పేద కొంపలో ఎన్నడూ అడుగు పెట్టలేదు. మీ అందరి జేబులూ కొల్లగొట్టితే కనీసం అయిదారు వందలన్నా పోగవుతుందని నాకు తెలుసు. అంత లక్ష్మి ఈ ఇంట్లో ఎన్నడూ అడుగు పెట్టలేదు. కూర్చోండి" అన్నాడు సూర్యనారాయణ చాలా ఉత్సాహంతో.

ఎందుకో అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. అందరితో పాటు సూర్యనారాయణ కూడా కూచుంటూ బయటినుంచి తివాసీలు తెచ్చిన మనిషితో "కుర్రాళ్ళను ఫలహారాలను తెమ్మను" అన్నాడు.

"నాకు ఫలహారమూ వద్దు, పాడూవద్దు! కాస్త టీ పోయించెయ్యి. నేను పోవాలి. నాకు మాచ్ ఉన్నది" అన్నాడు రంగారావు.

"నువ్వట్లా అనటానికి వీల్లేదు. నీతో టెన్నిసు ఆడటానికి నేను తప్ప లేని రోజున నువు నా తొందర పనులను ఏం పాటించావు? నాకు బాగా జ్ఞాపకం. నా భార్య జ్వరంతో తీసుకుంటుందన్నా, నువు వినిపించుకోకుండా నా చేత పొద్దూకేదాకా టెన్నిసు ఆడించావు. అది స్నేహధర్మం కనక నేను కాదనలేదు. నువ్వూ స్నేహధర్మం పాటించాలి. డబ్బును గురించిన ఎక్కువ తక్కువలు మనలో లేనేలేవు" అన్నాడు సూర్యనారాయణ.

"ఔట్రేజియస్! ఇటువంటి అసంబద్ధం ఎన్నడూ వినలేదు. నేను సారథితో ఫ్రెండ్లీమాచ్ ఆడాలిరా అంటుంటే?"

"ఇది ఫ్రెండ్లీ పార్టీ కాదుట్రా?"

"నీ టీ వద్దు ఏమీవద్దు. నేను పోతాను. అయిదింటికంటే వచ్చాను. ఇంత ఆలస్యమవుతుందంటే రాకేపోదును."

"మరచిపోకు. ఆనాడు నువు ఆరింటికి పంపుతానని ఆరున్నరదాకా ఉంచావు. ఇంకా లైటున్నది. మరో సెట్టాడవచ్చునని."

"అయిందేదో అయింది. ఇప్పుడైనా కాస్త టీ నా మొహాన కొట్టకూడదూ ?"

"టీ పార్టీలో టీ అనేది ముఖ్యం కాదు. జపానువాళ్లు చూడూ, టీ పార్టీకి పిలిచి మాటాడుకుని, వెళ్ళేటప్పుడు టీ పొడి ఇచ్చి అతిథులను పంపుతారు. నువు పోతానని తొందరచేస్తే టీ కోసం వచ్చావనీ, స్నేహపూర్వకంగా మాటాడటానికి కాదనీ అనుకోవలసి వస్తుంది" అన్నాడు సూర్యనారాయణ నవ్వుతూనే.

"నీ యిష్టం వచ్చినట్టనుకో. నేను వెళుతున్నాను" అంటూ రంగారావు వెళ్ళిపోయినాడు.

"నేను రంగారావు స్నేహాన్ని అర్థం చేసుకోలేదేమోనని భయంగా ఉంది. నేను స్నేహమనుకున్నది అతను అధికారంగా భావించాడేమో! అతను నాలుగు వందలు సంపాదిస్తే నేను నూటపాతికే సంపాదిస్తున్నాను చూడండి! ఏమంటారు ?" అన్నాడు సూర్యనారాయణ మిగిలినవాళ్ళతో.

"అతని కేదో తొందర పనుండి వెళితే నువ్వతన్ని గురించి అట్లా మాటాడటం భావ్యం కాదు" అన్నాడు శ్రీపతి.

ఇంతలో కుర్రాళ్ళు ఫలహారాలు అందరిముందూ తెచ్చి పెట్టారు. అందరూ ఆత్రంగా వాటిని పుచ్చుకో సాగారు.

"ఈ సందేహం నాకు ఒక్క రంగారావును గురించే కాదు. అందర్ని గురించీ ఉన్నది" అన్నాడు సూర్యనారాయణ. అందరూ తల ఎత్తి తెల్లబోయి చూశారు.

"నేను ఆర్థికంగా అసమర్థుణ్ని. ఒకవేళ నాకు డబ్బున్నా కూడా ఇంకొకరికి సహాయం చెయ్యకుండా, ఇంకొకరి సహాయం పొందకుండా జీవించగలననే నమ్మకం నాకు లేదు. ఆ ఉద్దేశంతో నా వల్ల సహాయం—కొరిగ సహాయమే అనుకోండి—పొందిన వాళ్లందర్నీ నా స్నేహితులుగా భావించి వాళ్ళకు నా కష్టసుఖాలు చెప్పుతున్నాను. వాళ్ళు కూడా తమ కష్టసుఖాలు నాతో చెప్పుతున్నారు.

"అయినా వాళ్లకూ నాకూ మధ్య ఉన్న స్నేహం గురించి నాకు అనుమానాలు కలగసాగాయి. ఒకసారి నాకు ఇంట్లో బియ్యంలేని పరిస్థితి ఏర్పడి మీలో ఒకరి దగ్గరికి—పేరు చెప్పను—అయిదు రూపాయలు బదులిమ్మని వచ్చాను. ఆ పెద్దమనిషి నా మాటలు విన్నాడు. కాని వాటిని పాటించినట్లు కనిపించలేదు. తన ఆర్థిక చిక్కులు మాట్లాడ సాగాడు. అవి తిండి చిక్కులు కావు, వ్యాపార సంబంధమైనవి. పాపం, ఆయనకు సమయంలో పదిహేనువేలు లేకపోవటంవల్ల పాతికవేలు లాభం రావలసింది కాస్తా పోయిందట. అదేదో దొంగ మార్కెటు దెబ్బ అని తెలుసుకున్నాను. ఆ స్నేహితుడి కష్టాలు రెండున్నర గంటలు విని నాకు కావలసిన అయిదు రూపాయల్లోనూ రెండు మాత్రమే పుచ్చుకుని, మిగిలిన డబ్బుకు మర్నాటికి వాయిదా వేయించుకుని ఇంటికి వెళ్ళాను.

"చిత్రమేమిటంటే నాకు తమ కష్టాలు చెప్పుకున్న నా స్నేహితులు వాళ్ళను మించిన కష్టాలు నా కున్నాయని ఎన్నడూ గ్రహించలేదు. నేను చెప్పినా అర్థం చేసుకోలేదు. ఇవాళ టీ పార్టీ ఇస్తున్నాననేసరికి మీలో చాలామంది నా గడప కూడా తొక్కలేదు."

"టీ పార్టీ అంటే ఎందుకిస్తున్నావని మీలో చాలామంది అడిగారు. కాని, ఒక్కరైనా, ఎట్లా ఇస్తున్నావు, నీకు డబ్బెక్కడిది? అని అడిగిన పాపాన పోలేదు."

అయినా మీరు నా స్నేహితులు కనుక మీకు చెప్పటం నా విధి. దొంగ నూరు రూపాయల నోట్లు నాకు దొరికాయి. వాటిని మార్చగా దాదాపు వెయ్యి రూపాయలు లభించింది. ఆకాశంనుంచి ఊడిపడ్డ ఈ ముల్లె కొంతైనా మీతో పంచుకోవాలని తహ తహ కలిగి పార్టీ ఇస్తున్నాను" అన్నాడు సూర్యనారాయణ.

అందరూ ఫలహారాలు మానారు.

"నిజంగానా? వేళాకోళమా?" అన్నాడు సోమయాజులు.

"దొంగనోట్లా? నిజమే?"

సోమయాజులు మాట్లాడకుండా లేచాడు. ఒక్కొక్కరే లేచారు.

"ఆతిథ్యం స్వీకరించకుండా మీరు లేవటం నా కేమీ బాగా లేదు" అన్నాడు సూర్యనారాయణ.

"ఆతిథ్యం బాగానే వుంది. ఇది ఆతిథ్యమేమిటి. అవమానం...గట్టి వాడివే...దొంగ రూపాయల నోట్లుట! నయం!" అనుకుంటూ ఒక్కొక్కరే జారారు.

హనుమంతరావు ఒక్కడే మిగిలాడు.

"రానీవోయ్! సరుకంతా తినేద్దాం! మీ ఆవిణ్ణీ పిల్లల్నీ కూడా రమ్మను!...భలేపని చేశావు! నా కళ్లు చల్లగా ఉన్నాయి! లఫంగులు! తేరగా తినటానికి వచ్చారు!" అన్నాడు హనుమంతరావు.

తినటం ఐనాక హనుమంతరావు, "ఏం సూర్యం? వీళ్లందర్నీ తిట్టటానికే ఇంత డబ్బు తగలేశావా? అసలే దరిద్రంగా ఉంటే!" అన్నాడు.

"లేదోయ్! నిజంగానే నాకు డబ్బు దొరికింది. దొంగనోట్లమాట బొత్తిగా అబద్ధంకాదు. ఎవరో ఒక ఆసామీకి ముప్ఫై దొంగనోట్లు-మూడు వేల రూపాయలకు—అంటగట్టారు. ఆయనకు చదువూ సంధ్యా లేదు. పెద్ద రైతు. అవి పుచ్చుకున్న కాసేపటికే నాకు కనిపించాడు. ఎందుకో నా కీ నోట్లు చూపించాడు, అనుమానం కలిగిందో ఏమిటో? నేనవి దొంగనోట్లని చెప్పాను. వెంటనే వాటిని తిరిగి తీసుకుపోయి ఇచ్చినవాళ్ళకు పారేశాడు. నాకు నాలుగు వందలు బహుమానం ఇచ్చాడు. వద్దనకుండా పుచ్చుకున్నాను" అన్నాడు సూర్యనారాయణ.

38014